బతుకులు నీటిపాలు

ఆశలన్నీ బిడ్డలపైనే పెట్టుకున్న తల్లిదండ్రులకు.. సరదా పేరిట వారు జలాశయాల్లో ఈతకు దిగి మృత్యువాత పడితే ఆ కడుపు కోతను అంచనా వేయలేం. అంత వరకూ తమతో కేరింతలు కొట్టిన మిత్రుడు కళ్ల ముందే గల్లంతైతే ఆ స్నేహితుల వేదన వర్ణనాతీతం. పెందుర్తి పరిధి మేహాద్రిగెడ్డ, నల్లక్వారీ మడుగులు ఇలాంటి ఆశల్ని, ఆనందాల్ని ఎన్నింటినో నిర్దాక్షిణ్యంగా తమలో కలిపేసుకున్నాయి. నగరంలో పెరిగిన యువత వీకెండ్, సెలవుల్లో ఈత సరదాతో ఈ జలాశయాల్లో దిగి, లోతుపై అవగాహనలేక ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాలకు, మిత్రులకు కన్నీటిని మిగుల్చుతున్నారు.



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా ▪ ప్రమాదాలకు నెలవు మేహాద్రి ▪ మరింత ప్రమాదకరం.. నల్లక్వారీ మడుగు

పెందుర్తి: నగర పరిధిలోని మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో సరదాగా ఈత కొట్టేందుకు దిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగు ఈ మృత్యుక్రీడకు తోడుగా నిలుస్తోంది. గత శనివారం ప్రహ్లాదపురానికి చెందిన ఓ వ్యక్తి ఈతకు దిగి, ప్రాణాలు కోల్పోవడంతో మేహాద్రి రిజర్వాయర్ మృత్యువేట మరింత పెరిగింది. ఇంత జరుగుతున్నా జలాశయాల్లో ఈతకు దిగే యువతను నియంత్రించడంలో అధికార యంత్రాంగం మాత్రం పెద్దగా దృష్టిసారించని పరిస్థితి.



వారం క్రితం మేహాద్రిలో మృతి చెందిన వ్యక్తిని బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

'మేహాద్రి'మింగిన ప్రాణాలు

సంవత్సరం	మరణాలు		
2019	07	2022	03
2020	04	2023	05
2021	10	2024	06
		2025	02



మేహాద్రిలో ప్రమాదకర ఊబి ఉన్న ప్రాంతం

మృత్యువేటలో మేహాద్రి

విశాఖ నగరానికి ఆనుకుని చాలా దగ్గరగా, కాస్త ఎక్కువ నీటి మట్టం ఉన్న రిజర్వాయర్ మేహాద్రి గెడ్డ. వేసవి సెలవులు కావడంతో రిజర్వాయర్ సందర్శనకు వచ్చేవారి సంఖ్య బాగా ఎక్కువగా ఉంది. పరిసర ప్రాంతాల్లోని ఆకతాయిలు, మందుబాబుల గురించైతే చెప్పాల్సిన పనేలేదు. అంతటితే వీరు ఆగితే బాగానే ఉండేది. కొందరు పూటుగా మద్యం సేవించి, మరి కొందరు యువత ఉత్సాహం కొద్దీ రిజర్వాయర్‌లోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల అలాంటి వారిని జలాశయంలో చేపలు పడుతున్న మత్స్యకారులు రక్షించారు. రిజర్వాయర్లో అక్కడక్కడా లోతు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఊబిల్లో కూరుకుపోతే వారిని రక్షించడం కూడా కష్టం. ఇక్కడ ఈతకు దిగడంపై నిషేధం విధించినా, ఆ హెచ్చరిక బోర్డులను ఎవరూ లెక్కచేయట్లేదు. గత కొన్నేళ్లలో మేహాద్రిలో సరదాగా ఈతకు దిగి దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరం.



ప్రమాదకరమైన పెందుర్తి నల్లక్వారీ మడుగు

నల్లక్వారీ మరింత ప్రమాదకరం

పెందుర్తిలో మరో అత్యంత ప్రమాదకర నీటి మడుగు నల్లక్వారీ మడుగు. పదునైన రాతి శిలలు, చాలా ఎక్కువ ఊబిలతో కూడిన ఈ మడుగులో ఆరేళ్ల క్రితం ఐదుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి మరణించడం పెను విషాదం. దానికి కొన్నాళ్ల ముందు ఐదుగురు మేకల కాపరులు ఇందులో దిగి, ప్రాణాలు కోల్పోయారు. నల్లక్వారీ మడుగు సుమారు 80 మంది ప్రాణాల్ని తనలో కలిపేసుకుంది. పరిధి ఎక్కువ కావడం, చిన్నచిన్న మార్గాల్లో కూడా ఇక్కడికి వచ్చేందుకు అవకాశం ఉండటంతో ఇందులో దిగకుండా నియంత్రించడం చాలా కష్టం. వీటితో పెందుర్తి పరిధిలో చిన్నచిన్న గెడ్డలు, చెరువులు కూడా ప్రమాదభరితంగా తయారై, మృత్యుఘోష వినిపిస్తున్నాయి.

నిఘా, పర్యవేక్షణ నిల్!

ఎన్నో కుటుంబాల్లో తీరని శోకానికి కారణమవుతున్న మేహాద్రి రిజర్వాయర్ వద్ద నిఘా, పర్యవేక్షణ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఏటా పిక్నిక్‌ల సీజన్, సంక్రాంతి, వేసవి సెలవుల్లోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రిజర్వాయర్ గేటు సమీపంలో ఇది నిషేధిత ప్రాంతం, ఈతకు దిగరాదనే హెచ్చరిక బోర్డులు తప్ప, దాన్ని ఉల్లంఘించేవారిని అడ్డుకునే నాథుడు లేడు. కొన్నిసార్లు అందుబాటులో ఉన్న రిజర్వాయర్ సిబ్బంది జలాశయంలో దిగేవారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా.. వారు ఖాతరు చేయట్లేదన్న వాదనలున్నాయి. పిల్లలు, యువత ప్రాణాలు కోల్పోయాక దానిపై పంచనామా చేసే బదులు, పటిష్ట నిఘా, పర్యవేక్షణ ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామనే హామీలు.. నీటి మీద రాతలే అవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



మేహాద్రి రిజర్వాయర్, నల్లక్వారీ మడుగుల్లో ఈతకు వెళ్లిన పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. మేహాద్రి రిజర్వాయర్ వద్ద ప్రత్యేకంగా మా సిబ్బందిని గస్తీ ఉంచుతున్నాం. నల్లక్వారీ వద్ద కూడా గస్తీ ఉంచుతాం. ప్రమాదకర ప్రాంతాల్లో మందు పార్టీలు చేసుకునే వారిని డ్రోన్ల సాయంతో గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటాం.

-కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

క్లుప్తంగా

రామాలయంలో విశేషంగా హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్దనున్న ప్రాచీన రామాలయంలో శుక్రవారం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. విశేషంగా పారాయణాలు జరిపారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



కల్యాణోత్సవంలో యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు 10 మంది పట్టుబడ్డారు. వీరికి కోర్టు రూ.91 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు.

న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు



శ్లాబ్‌పై మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: ఎట్టకేలకు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ భవనం మరమ్మతులను శుక్రవారం ప్రారంభించారు. ఆ పనులను సీఐ కామేశ్వరరావు పరిశీలించారు. వర్షాలు పడితే చాలు, ఈ భవనం శ్లాబ్ ఎక్కడికక్కడ కారిపోతోంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లోని ఫైళ్లు తడిసిపోతున్నాయి. సీరియస్ కేసులకు సంబంధించిన ఫైళ్లకు కూడా ఇదే నష్టం వాటిల్లితో ఇబ్బందులు తప్పవని తేలడంతో సీఐ స్పందించారు. పోలీస్ స్టేషన్ భవన పరిస్థితిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి వివరించారు. దీంతో సీపీ స్పందించి పోలీస్ సంక్షేమ నిధి నుంచి నిధులు విడుదల చేయించారు. ఇప్పటికే వర్షాకాలం సమీపించడంతో ఆ నిధులతో వెంటనే భవన శ్లాబ్‌కు మరమ్మతు పనులు చేపట్టారు.

వృద్ధురాలి అదృశ్యం



అదృశ్యమైన వృద్ధురాలు రమణమ్మ

గోపాలపట్నం: ఇంటి నుంచి బయటికు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమయిందని కుటుంబ సభ్యులు గోపాలపట్నం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం గొల్ల వీధిలో నివాసముంటున్న ఉప్పిలి రమణమ్మ తన కొడుకు ఉప్పిలి రాజుతో కలిసి నివాసముంటోంది. కొన్నేళ్లుగా ఆమెకు మతిస్థిమితం లేక ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ నెల 21 రాత్రి 9 గంటల సమయంలో మాత్రలు వేసుకోవడం విషయంలో గొడవ పడింది. తన అమ్మగారింట్లో పడుకుంటానని వెళ్లిన ఆమె అక్కడికి చేరిన కొద్ది సేపటికి ఎటు వెళ్లిందో కనిపించక పోవడంతో చుట్టు పక్కల వాకబు చేయడంతో పాటు చుట్టాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసుల్ని ఆశ్రయించారు. వృద్ధురాలు ఎక్కడైనా కనిపిస్తే సమాచారమివ్వాలని గోపాలపట్నం పోలీసులు కోరారు.

సర్పంచ్ కుటుంబ సభ్యులకు అదీప్‌రాజ్ పరామర్శ



సర్పంచ్ కుంటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో అత్యాచారయత్నానికి గురైన బాలింతతో పాటు కొట్లాట వివాదంలో చిక్కుకున్న సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం పరామర్శించారు. గ్రామంలో బాధితుల ఇంటికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. వివాదంలో చిక్కుకున్న బాధితుల్ని బయటకు తెచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. బాధితుల నుంచి వివరాలు ఆరా తీశారు. బాధితులు మీడియాతో మాట్లాడుతూ బాలింత పిల్లల హేమలతపై గ్రామానికి చెందిన పల్ల దేముడుబాబు అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడటంతో నిలువరించే క్రమంలో వివాదం జరిగినట్టు తెలిపారు. నిందితుడు దేముడుబాబు విచక్షణారహితంగా సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు మరి కొంత మందిపై దాడి చేయడంతో వివాదం తీవ్రమై, దేముడుబాబుకూ గాయాలైనట్లు పేర్కొన్నారు. అయితే దాడి విషయం వీడియో తీసి, వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి సర్పంచ్‌తో పాటు మరి కొందరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారుర. అయితే అత్యాచారయత్నానికి పాల్పడిన దేముడుబాబుపై బాధితురాలు సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, కేసు నమోదు చేయలేదని ఆక్షేపించారు. అదే విధంగా చోడవరం పోలీస్ స్టేషన్‌లో ముందుగా దాడికి పాల్పడిన దేముడుబాబుపై కేసు నమోదు చేయకుండా ఏకపక్షంగా సర్పంచ్, అతనితో ఉన్న కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు. అదీప్‌రాజ్ మాట్లాడుతూ వివాదం సమయంలో తీసిన వీడియోలో కొంత భాగం ఎడిట్ చేసి పోలీసులకు అందించడం వల్లే పొరపాటు జరిగినట్లు భావిస్తున్నామన్నారు. అత్యాచారయత్నానికి పాల్పడి, విచక్షణా రహితంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలన్నారు. బాధితులకు తగిన న్యాయం జరిగేవరకూ న్యాయ పోరాటం చేస్తామని, అవసరమైతే ఎస్పీతో పాటు న్యాయస్థానం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ జెడ్పీటీసీ, పార్టీ అధికార ప్రతినిధి కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు, పార్టీ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, సీనియర్ నాయకుడు రాపేటి రాము, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, గొర్లి రాజేష్, మహలక్ష్మి నాయుడు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, కడియాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.


గ్రామ సచివాలయ భవనాన్ని పూర్తి చేయరూ..



అసంపూర్తిగా నిలిచిన పెదముషిడివాడ గ్రామ సచివాలయ భవనం

పరవాడ: గ్రామీణ ప్రజలు నేరుగా ప్రభుత్వ సేవలను పొందేందుకు వీలుగా గత ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దాదాపుగా ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయ భవనాన్ని ఏర్పాటు చేసింది. దీంట్లో భాగంగా పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో సచివాలయ భవనం నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు ఆ నిధుల మేరకు సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఆ తర్వాత ప్రభుత్వం మారడం, నిధుల కేటాయింపులు పోవడంతో తలుపులు, కిటికీలు, విద్యుత్, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులను చేపట్టకుండా వదిలేశారు. దీంతో భవనం అందుబాటులోకి రాక, పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయ సిబ్బంది తమ విధులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనాన్ని పూర్తి చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సిటు ఆవిర్భావ దినోత్సవం



ఫార్మాసిటీలో సిటు జెండాను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

పరవాడ: సీఐటీయూ(సిటు) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఫార్మాసిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిటు జెండాను సిటు ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిటు, అప్పటి నుంచి నేటి వరకు కార్మిక హక్కుల రక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతూ దోపిడీలేని సమాజం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉండే కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి, కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తూ, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు నాయకులు కె.రమణ, సత్తిబాబు, చిట్టిబాబు, కె.అప్పలరాజు, శేషు పాల్గొన్నారు.

రెండు గంటల్లో చిన్నారి ఆచూకీ లభ్యం



చిన్నారి మానవిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఆడుకుంటూ ఇంటి ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోయిన మూడేళ్ల చిన్నారి ఆచూకీని పెందుర్తి పోలీసులు రెండు గంటల వ్యవధిలో కనిపెట్టారు. వివరాలివి.. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొగ్గవానిపాలేనికి చెందిన నకరాపు మానవి(3) గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా.. ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటోంది. అయితే కొద్దిసేపటికి మానవి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కాలనీలో శోధించారు. దాదాపు రెండు గంటల తరువాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నారిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

చిరస్మరణీయురాలు అహల్యాబాయి హోల్కర్

బీజేపీ ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలు



తొలిపావంచా నుంచి నడక సాగిస్తున్న మహిళలు, బీజేపీ నాయకులు

సింహాచలం: అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విశాఖ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో సింహాచలం కొండదిగువ తొలిపావంచా వద్ద చేనేత నడక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి స్థానికంగా ఉన్న శ్రీనివాస కల్యాణ మండపం వరకు పలువురు మహిళలు చేనేత వస్త్రాలు ధరించి నినాదాలు చేస్తూ నడిచి వెళ్లారు. అనంతరం కల్యాణమండపంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.మధుకర్ మాట్లాడారు. అహల్యాబాయి హోల్కర్ గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించారన్నారు. సుమారు మూడు వేల ఆలయాలను నిర్మించి హిందూ ధర్మం కోసం విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినీ ఆనంద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కూడా అహల్యాబాయి బాటలో నడుస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను 4వ స్థానంలో నిలబెట్టారన్నారు. విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎం.పరశురామరాజు మాట్లాడుతూ కుటుంబాన్ని పోగొట్టుకున్నా మొక్కవోని సంకల్పంతో రాజ్యం కోసం, రాజ్య ప్రజల కోసం 30 ఏళ్ల పాలన చేసి, శ్రీశైలం, సోమనాథ్ ఆలయాలని పునర్నించారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మహమ్మదీయులను మాత్రమే హైలెట్ చేస్తూ, అహల్యాబాయి గురించి పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాకే మరుగున పడిపోయిన సంఘం సంస్కర్తల సేవలను, పోరాటాలను వెలుగులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే శనివారం(మే 31) ఆమె పుట్టినరోజు పురస్కరించుకుని పది రోజులపాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ కన్వీనర్ అచ్యుత రామ్మోహన్, బీజేపీ నాయకులు సుజాత, కామేష్, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 98వ వార్డు బీజేపీ అధ్యక్షుడు ఆర్.వర్మ పాల్గొన్నారు.

చిన్న ఆలయాలే టార్గెట్

గుడుల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: ఆలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆకోజు బ్రహ్మాజీ అనే వ్యక్తిని వన్‌టౌన్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి సుమారు 2,900 గ్రాముల వెండి, 7.6 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాలు వెల్లడించారు. అల్లిపురం, సింహాలదేవిడికి చెందిన చెందిన బ్రహ్మాజీ ఈ నెల 19న టౌన్ కొత్తరోడ్డులోని దుర్గమ్మ గుడిలో పూజారిగా పని చేస్తానని వెళ్లాడు. నిర్వాహకులు సకల సూర్యారావు దంపతులు అతన్ని నమ్మి పూజ బాధ్యతలు అప్పగించారు. పూజకు కావాల్సిన వస్తువులు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లిన వారు తిరిగి వచ్చే సరికి అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, హస్తం, చెవి ఆభరణాలతో ఉడాయించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ క్రైం పోలీసులు.. హార్బర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసు పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి.. శుక్రవారం కురుపాం మార్కెట్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మొత్తం 10 నేరాలకు సంబంధించిన సుమారు 2,900 గ్రాముల వెండి వస్తువులు, 7.6 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బ్రహ్మాజీ ఒంటరిగా జీవిస్తున్నాడని, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దొంగతనాలకు పాల్పడుతున్నాడని తేలింది. భార్య, కుమారుడు అతన్ని వదిలేశారు. వయసు కారణంగా వేరే పనులు చేసుకోలేని బ్రహ్మాజీ చిన్న ఆలయాల్లో ఆభరణాలు దొంగలించి, రోజువారీ అవసరాలు తీర్చుకుంటున్నాడు. అతను గతంలోనూ వన్‌టౌన్, పెందుర్తి, కంచరపాలెం, మల్కాపురం, చోడవరం, భీమిలీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సమావేశంలో హార్బర్ సబ్ డివిజన్ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు, వన్‌టౌన్ క్రైం ఎస్‌ఐ ఎస్.రామమూర్తి, ఎస్‌ఐ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తార్కాణమే 'స్పెక్ట్రమ్'

విశాఖ విద్య: విద్యార్థుల అద్భుత ప్రతిభకు తార్కాణంగా 'స్పెక్ట్రమ్' ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్ఎం, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రమ్– 2025ను శుక్రవారం వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలు ఆయన తిలకించి అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలను నిశితంగా పరిశీలించి.. వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



• ఉదయం ఎండ.. సాయంత్రం వాన

పగలంతా సూర్యుడు చుర్రుమనిపించాడు. దీనికి తోడు గాలిలో అధిక తేమ కారణంగా తీవ్ర ఉక్కబోత వాతావరణం నెలకొంది. ఇదంతా శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకే. ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారింది. తొలుత ఆకాశం మబ్బులు పట్టి, భారీ ఈదురు గాలులు మొదలయ్యాయి. ఆ తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వాన. అంతే అప్పటి వరకు ఉన్న ఉక్కబోత నుంచి పెందుర్తి ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వానలు ఖరీఫ్ దుక్కులకు ఉపయోగపడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - పెందుర్తి

